క్లుప్తంగా

ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాల గడువు పెంపు

మర్రిగూడ : తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాల గడువును ఈనెల 21 వరకు పొడిగించినట్లు మండల కేంద్రంలోని ఓపెన్ స్కూల్ అసిస్టెంట్ కోఆర్డినేటర్ డి.సుందరయ్య ఆదివారం తెలిపారు. మధ్యలో బడి మానేసిన వారు ఓపెన్ స్కూల్ ద్వారా విద్యను కొనసాగించవచ్చని తెలిపారు. ఇతర వివరాలకు 9440927542 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

ప్రత్యేక ఓటరు క్యాంపు పరిశీలన

చండూరు : చండూరు మండలం కోటయ్యగూడెం గ్రామంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు క్యాంపును ఆదివారం తహసీల్దారు రవీందర్ రెడ్డి పరిశీలించారు. నూతన ఓటర్లు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లు పంపిణీ చేయాలి

నల్లగొండ రూరల్ : పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లను పంపిణీ చేయాలని టీడీపీ నల్లగొండ నియోజక వర్గ ఇన్‌చార్జి ఎల్‌వీ యాదవ్ కోరారు. ఆదివారం పట్టణంలోని కలెక్టరెట్ వెనుక భాగంలో ఉన్న డబల్ బెడ్ రూం ఇళ్లను ఆదివారం ఆయన పరిశీలించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను బీఆర్ ఎస్ పార్టీ అమలు చేయలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు గుండు వెంకటేశ్వర్లు, సిద్దీఖ్, రఫీ, మనోహర్, పరమేష్, గంగాదర్, స్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు రక్తదాన శిబిరం

చండూరు : చండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో మంగళవారం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు వైద్యాధికారి రాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. శిబిరానికి ప్రభుత్వ ఉద్యోగులు స్వచ్ఛందంగా తరలి వచ్చి రక్తదానం చేయాలని కోరారు.

కిషోర్‌కుమార్‌కు అవార్డు

నల్లగొండ టౌన్ : పలుసామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించినందుకు గాను సూర్యాపేట ఎస్పీ కార్యాలయంలో ఏఎస్‌ఐగా పనిచేస్తున్న కిషోర్‌కుమార్‌కు పుడమి సాహితి వేదిక ఆధ్వర్యంలో ఆదివారం స్థానికంగా జరిగిన సమావేశంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ స్మారక పురస్కారాన్ని వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చిలుముల బాల్‌రెడ్డి అందజేశారు. కిషోర్‌కుమార్ ఇప్పటికే పలు జాతీయ అవార్డులను అందుకున్నారు.

అనుచిత వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలి

కనగల్: సోషల్ మీడియాలో యాదవులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఆదివారం యాదవ సంఘం మండల అధ్యక్షుడు జెట్టి శ్యాంసుందర్ యాదవ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు మండలి పరమేష్, పెద్దులు, ఏటేళ్లి సైదులు, కోటేష్, మేఘరాజు, గణేశ్, సత్య, శివ, సాయి, చందు, వంశీ, శంకర్ తదితరులు ఉన్నారు.

అనుచిత వాఖ్యలు చేసిన వ్యక్తిపై ఫిర్యాదు

చండూరు: సోషల్ మీడియాలో యాదవ కులస్తులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేయాలని కోరుతూ చండూరు యాదవ సంఘం నాయకులు ఆదివారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో యాదవ సంఘం మండల అధ్యక్షుడు ఆవుల అశోక్, చొప్పరి రాజు, కదారి సైదులు,చొప్పరి యాదయ్య,దోటి సందీప్ పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయాలి

నల్లగొండ టౌన్ : ఎస్సీ ఎస్టీ, బీసీలకు రాజకీయంగా అన్ని రాజకీయ పార్టీలు సముచిత స్థానం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 5న గడియారం సెంటర్‌లో నిర్వహించే ధర్నాను జయప్రదంచేయాలని ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తలారి రాంబాబు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానికంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మల్లయాదగిరి, రాఘవేంద్రయాదవ్, సుదాకర్, సతీస్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నేడు ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

మర్రిగూడ : మండల కేంద్రంలోని శ్రీ మడివాల వాసుదేవుడుసీతాలమ్మఈదమ్మ ఆలయంలో చేపట్టిన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా సోమవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాప నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు లోక వెంకటశర్మ తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పూజ దోష పూజలు, పాలాభిషేకం, హోమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రజకసంఘం ఆలయ కమిటి అధ్యక్షుడు పగడాల అంజయ్య, మాజీ ఎంపీటీసీ వెంకటంపేట బాలయ్య, సిలివేరు పెద్దయ్య, పగడాల రఘు, కొలుకులపల్లి యాదయ్య, పగడాల లింగయ్య, శ్రీశైలం, పగడాల నగేష్, ఎల్లేష్ పాల్గొన్నారు.

శ్రీనివాసాచారికి అవార్డు

చండూరు : చండూరు పట్టణానికి చెందిన ప్రభుత్వ తెలుగు ఉపన్యాసకులు డా.ఇడికోజు శ్రీనివాసాచారికి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పురస్కారం దక్కింది. పుడమి సాహితీ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక నల్లగొండ పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన అవార్డు అందుకున్నారు

ప్రభుత్వ స్కూళ్లకు రక్షణేదీ!

- కేతేపల్లిలో చాలా పాఠశాలలకు ప్రహరీలు కరువు
- ఆవరణల్లో సంచరిస్తున్న మూగజీవులు
- రాత్రిపూట మందుబాబులకు అడ్డాగా మారుతున్న విద్యాలయాలు
- నైట్ వాచ్‌మెన్లు లేకపోవడం కూడా ఇందుకు కారణమే..


గుడివాడ జంగాల కాలనీ పాఠశాల ఆవరణలో సంచరిస్తున్న గొర్రెలు

కేతేపల్లి: ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీలు లేక రక్షణ కరువైంది. కేతేపల్లి మండలంలో మొత్తం 30 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. అందులో 9 ఉన్నత, ఒకటి ప్రాథమికోన్నత, 20 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలలకు భవనాలు నిర్మించి ఏళ్లు గడుస్తున్నా కొన్నింటికి ప్రహరీ గోడలు లేవు. కొత్తపేట ఎస్సీ కాలనీ, బొప్పారం, గుడివాడ జంగాల కాలనీ, ఇనుపాముల, బండపాలెం, చీకటిగూడెం తదితర పాఠశాలలకు పక్కా భవనాలు ఉన్నప్పటికీ ప్రహరీలు నిర్మించలేదు. కేతేపల్లిలో పాఠశాలకు వెనుక వైపున, గుడివాడ జెడ్పీ పాఠశాలకు చెరువు వైపు ప్రహరీలు లేవు.

ఆకతాయిలకు అడ్డాలుగా..

పాఠశాలలకు ప్రహరీలు లేకపోవడంతో రాత్రిపూట ఆకతాయిలు అసాంఘిక కార్యకలాపాలు కొనసాగించేందుకు అడ్డాలుగా మారుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. అక్కడే మద్యం సేవించి సీసాలను పాఠశాలల ఆవరణలోనే పగులగొడుతున్నారు. దీంతోపాటు మద్యంతో పాటు తినుబండారాలు ప్యాక్ చేసి తెచ్చుకున్న కాగితాలు, ప్లాస్టిక్ కవర్లను సైతం పాఠశాలల ఆవరణల్లోనే వదివెళ్తున్నారు. దీంతో పాఠశాలల మైదానాలు, వరండాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. అపరిశుభ్రంగా దర్శనమిస్తున్న పాఠశాలలకు అటెండర్లు లేకపోవటంతో మద్యంబాబులు తాగి పడేసిన సీసాలు, ఇతర చెత్తాచెదారాన్ని విద్యార్థులే తొలగించాల్సిన పరిస్థితి నెలకొంటోంది. రెండేళ్ల క్రితం ఓ పాఠశాలలో ఆకతాయిలు ఏకంగా తరగతి తలుపులు బద్దలు కొట్టి మరీ మద్యం సేవించిన సంఘటన చోటు చేసుకుంది. దీంతో పాటు పాఠశాలలో ఏర్పాటు చేసిన నల్లాలు, కరెంటు బోర్డులు, స్విచ్‌లను సైతం ధ్వంసం చేస్తున్నారు. గుడివాడలో చెరువు పక్కనే ఉన్న పాఠశాలకు ప్రహరీ లేకపోవటంతో బహిర్భూమికని వెళ్లిన ఓ విద్యార్థి నీటిలో మునిగి మృతి చెందాడు. వీటికితోడు ప్రహరీలు ఉన్న పాఠశాలలకు కనీసం గేట్లు సక్రమంగా లేకపోవడంతో ఆవరణల్లోకి పశువులు వెళ్లి హరితహారంలో భాగంగా నాటిన మొక్కలను తినేస్తున్నాయి. పరిసరాలను అపరిశుభ్రంగా మారుస్తున్నాయి. పాఠశాలలకు ప్రహరీలు, వాచ్‌మెన్లు లేకపోవడంతో మందుబాబుల ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు సైతం రాత్రి వేళలో పాఠశాలల వైపు దృష్టి సారించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విద్యా సంవత్సరంలోనైనా ప్రహరీగోడలు నిర్మించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

నైట్ వాచ్‌మెన్లను నియమించాలి


పాఠశాలలకు ప్రహరీలు లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్నాయి. ఆకతాయిలు పాఠశాలల్లో మద్యం సేవిస్తున్నారు. రక్షణ లేక అక్కడక్కడా దొంగతనాలు కూడా జరుగుతున్నాయి. ప్రతి పాఠశాలకు ప్రహరీలు నిర్మించి నైట్ వాచ్‌మెన్లను నియమించాలి.

– పట్టేటి జానకిరాములు, కొత్తపేట

ప్రహరీలు నిర్మించాలి


గుడివాడ జంగాల కాలనీ ప్రాథమిక పాఠశాలకు ప్రహరీగోడ లేకపోవడంతో పరిసరాల్లో పశువులు సంచరిస్తున్నాయి. హరితహారంలో నాటిన మొక్కలు తినేస్తున్నాయి. అంతేకాక పాఠశాల పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నాయి. ప్రహరీని నిర్మించి సమస్యను పరిష్కరించాలి

– జగన్నాథం, గుడివాడ

నిధులు రాగానే నిర్మాణాలు


ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. ఇప్పటికే మన ఊరు–మన బడి ద్వారా ఎంపికైన పాఠశాలలకు తగిన నిధులు కేటాయించి నిర్మాణ పనులు ప్రారంభించాం. విడతల వారీగా అన్ని పాఠశాలలకు నిర్మాణం కోసం నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపించాం.

– నాగయ్య, ఎంఈఓ, కేతేపల్లి

బీఆర్‌ఎస్ హయాంలో మైనార్టీలకు పెద్దపీట


ఇంతియాజ్ ఇషాక్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, నాయకులు

నల్లగొండ టూటౌన్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం మైనార్టీలకు పెద్దపీట వేసిందని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రానికి వచ్చిన రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మహమ్మద్ ఇంతియాజ్ ఇషాక్‌ను జిల్లా కేంద్రంలోని వీటీ కాలనీలో గల తన కార్యాలయంలో ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మైనార్టీల పిల్లల విద్య కోసం ప్రత్యేకంగా మైనార్టీ గురుకులాలు ఏర్పాటు చేసి ఒక్కో విద్యార్థికి ఏడాదికి లక్షా 20 వేల ఖర్చు చేస్తుందన్నారు. మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ మహమ్మద్ ఇంతియాజ్ ఇషాక్ మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమానికి సంక్షేమానికి పాటు పడుతున్న కేసీఆర్ ప్రభుత్వానికి అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి నిరంజన్ వలి, మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, కనగల్ ఎంపీపీ కరీంపాషా, కలీం పాల్గొన్నారు.

నిధులు విడుదల చేయాలని వినతి

నల్లగొండ పట్టణంలోని తెలంగాణ మైనార్టీ బాలికల పాఠశాల, కళాశాలకు శాశ్వత భవన నిర్మాణం కొరకు, ఎస్‌ఎల్‌బీసీలోని బాలుర మైనార్టీ కళాశాల భవనం, హాస్టల్ భవన నిర్మాణం కోసం నిధుల విడుదల చేయించాలని కోరుతూ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మహమ్మద్ ఇంతియాజ్ ఇషాక్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి నిరంజన్‌వలి, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి రాజేందర్‌రెడ్డి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

నల్లగొండ పట్టణానికి చెందిన మిర్జా షాహెద్ బేగ్ నేతృత్వంలో సుమారు 500 మంది యువకులు ఆదివారం నల్లగొండలోని వీటీకాలనీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మైనార్టీ యువతకు ఉపాధి కల్పించేందుకు కేసీఆర్ ప్రభుత్వం మైనార్టీ బంధు పథకం ప్రవేశ పెట్టిందన్నారు. కేసీఆర్ విజన్‌తోనే నల్లగొండ పట్టణం అభివృద్ధిలో హైదరాబాద్ నగరాన్ని తలపిస్తుందని తెలిపారు. నల్లగొండ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతునున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఇంతియాజ్ ఇషాక్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి నిరంజన్‌వలి, మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, కౌన్సిలర్ సమి, ఇబ్రహీం పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి


ప్రమాణ స్వీకారం చేస్తున్న అల్లుబెల్లి నర్సింహారెడ్డి

కనగల్: ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. భక్తుల పాలిట కొంగుబంగారంగా విరాజిల్లుతున్న దర్వేశిపురం ఆలయ పాలక మండలి ప్రమాణ స్వీకారోత్సవం కార్యక్రమంలో ఆదివారం ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, గ్రంథాలయ చైర్మన్ మల్లికార్జున్‌రెడ్డి, ఎంపీపీ కరీంపాష, జెడ్పీటీసీ చిట్ల వెంకటేశంగౌడ్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అయితగోని యాదయ్యగౌడ్, పీఏసీఎస్ చైర్మన్‌లు వంగాల సహదేవరెడ్డి, దోటి శ్రీనివాస్, జొన్నలగడ్డ శేఖర్‌రెడ్డి స్థానిక సర్పంచ్‌లు పూలమ్మ,అంజమ్మ ఎంపీటీసీ శైలజసైదులు, బీఆర్‌ఎస్ నాయకులు ఎర్రమాద వెంకట్‌రెడ్డి, కదారి కృష్ణయ్య, జానయ్య, సంజీవ, బైరి నాగేష్ పాల్గొన్నారు.

నిరాహార దీక్షలను విజయవంతం చేయాలి

కేతేపల్లి: సమగ్రశిక్షా అభియాన్‌లో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలనే డిమాండ్‌తో ఈనెల 4వ తేదీ నుంచి కలెక్టరేట్ కార్యాలయం ముందు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలలో ఉద్యోగులంతా పాల్గొని విజయవంతం చేయాలని సమగ్రశిక్షా అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కంచర్ల మహేందర్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన కేతేపల్లిలో విలేకరులతో మాట్లాడారు. సమగ్రశిక్షలోని వివిధ స్థాయిలలో దాదాపు 25 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులు పదిహేనేళ్లుగా చాలీచాలని వేతనాలతో పని చేస్తున్నారని అన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులకు కనీసం వేతనం అమలు చేయటంతో పాటు ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరారు.

ఆలయాభివృద్ధికి రూ.50వేల విరాళం

చిట్యాల: మండలంలోని చిన్నకాపర్తి గ్రామంలోని శ్రీ సీతారామాంజనేయ సహిత అంబికా జగదీశ్వరాలయం అభివృద్ధికి ఆ గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ తిరుమలదాసు శ్రీనివాస్–ఉషారాణి దంపతులు అందజేసిన రూ.50వేల రూపాయల నగదును ఆదివారం శ్రీనివాస్ తండ్రి లింగయ్య ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు అందజేశారు. అనంతరం ఆలయం ఆవరణలో ఆ గ్రామానికి చెందిన నాతి ముత్తిలింగం ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన పండ్ల మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఉప్పరబోయిన స్వామి, మునుగోటి లింగయ్య, గంగాపురం భాస్కర్‌గౌడ్, మిర్యాల జగన్నాథం, గురిజ శంకరయ్య, రుద్రారపు శ్రీను, ఆలయ పూజారి బోగ మహేష్‌కుమార్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన


ట్యాంకు నుంచి నీళ్లు బయట పోస్తున్న సిబ్బంది


నల్లగొండ టూటౌన్: సీజనల్ వ్యాదులు ప్రబలకుండా మున్సిపాలిటీ అధికారులు పట్టణంలో ఆదివారం ఉదయం 10 గంటలకు 10 నిమిషాలకు అవగాహన కల్పించారు. పట్టణంలోని 7వ వార్డులో ఆదివారం ఇంటింటికి తిరుగుతూ నీటి ట్యాంకులు శుభ్రం చేయించడం, దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ వారిని చైతన్యం చేశారు. తాగు నీటి పై మూతలు పెట్టడం, ఇంటి ఆవరణలో నీరు నిల్వకుండా చేయడం, మరుగుదొడ్డి గ్యాస్ పైప్‌కు నెట్టు బిగించుకోవడం లాంటివి చేపట్టడం ద్వారా సీజనల్ వ్యాదులకు దూరంగా ఉండ వచ్చని తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు సురిగి శంకర్, నాగరాజు, జవాను పెరిక సైదులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

చిట్యాల: పెట్రోల్, డీజిల్‌తో పాటు నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమయ్యిందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ విమర్శించారు. చిట్యాల మండలం పిట్టంపల్లి గ్రామంలో ఆదివారం పెరిగిన ధరలను నిరసిస్తూ ఆ పార్టీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు మెట్టు నర్సింహ, మెట్టు పరమేష్, మెట్టు మల్లేష్, చంద్రయ్య, పాపయ్య, వంశీ, సతీష్, వెంకటేష్, శివ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలికి సన్మానం

చిట్యాల: పట్టణంలోని భవిత విద్యా వనరుల కేంద్రంలో ప్రత్యేక ఉపాధ్యాయురాలుగా సేవలందిస్తున్న ఆవుల గీత ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైంది. నల్లగొండలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో పుడమి సాహితి వేదిక ఆధ్వర్యంలో ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమెకు ఆ సాహితి వేదిక అధ్యక్షుడు చిలుముల బాల్‌రెడ్డి జ్ఞాపికను అందజేశారు. ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపికైన గీతను భవిత కేంద్రం ఉపాధ్యాయులు అభినందించారు.


గీతను సత్కరిస్తున్న సాహితీ వేదిక ప్రతినిధులు

పెరిక గోపాల్‌కు నివాళి


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

నల్లగొండ టౌన్: ప్రకాశంబజార్ వ్యవస్థాపకులలో ఒకరైన దివంగత పెరిక గోపాల్ 21వ వర్ధంతిని ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాశం బజార్‌లోని నిర్వహించిన కార్యక్రమంలో పెరిక గోపాల్ విగ్రహానికి స్థానిక ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పెరిక ఉమామహేశ్వర్‌రాజ్, పెరిక కరణ్‌జయరాజ్, పెరిక వినాయకరాజ్, మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, గ్రంథాలయ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్ రెడ్డి, నవీన్‌కుమార్,సైదులు, మహేష్, కట్టెల శివ, యూసూఫ్, నగేష్ దుర్గా పాల్గొన్నారు..

కొనసాగుతున్న నిరాహార దీక్ష

మునుగోడు: మునుగోడు మండలంలోని కిష్టాపురం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఫార్మా కంపెనీ అనుమతులు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో 136 రోజులుగా చేపడుతున్న రిలే నిరాహార దీక్ష ఆదివారం కొనసాగింది. ఈ దీక్షలో కూర్చున అఖిలపక్ష పార్టీల నాయకులకు ఫార్మా వ్యతిరేక కమిటీ కన్వీనర్ భీమనపల్లి సైదులుతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు మద్దతు పలికి పూల మాల వేసి దీక్షను ప్రారంభించారు.

పల్లెపల్లెనా వైభవంగా బోనాల పండుగ


నార్కట్‌పల్లి : కొండపాకగూడెంలో బోనాలను ఎత్తుకెళ్తున్న మహిళలు


ముత్యాలమ్మ ఆలయం వద్ద బోనాలతో మహిళలు

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండలం అంతాయిగూడెంలో ఆదివారం బోనాల పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామ మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి గ్రామ దేవత ముత్యాలమ్మకు బోనాలు సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు. సర్పంచ్ సిరిగిరి పద్మ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ పంటలు సమృద్ధిగా పండాలని ముత్యాలమ్మ దీవెనలతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు సిరిగిరి రాంరెడ్డి, నల్లబోలు సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ టూటౌన్: నల్లగొండ పట్టణంలోని 11వ వార్డు మామిళ్లగూడెం, అర్బన్ కాలనీలో ఆదివారం బోనాల పండుగ వైభవంగా నిర్వహించారు. మహిళలు బోనాలు ఎత్తుకువచ్చి ముత్యాలమ్మ అమ్మ వారికి నైవేద్యంగా పెట్టారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ కంకణాల లక్ష్మమ్మ, మాజీ సర్పంచ్ జనార్దన్‌రెడ్డి, స్థానికులు కిషన్, క్రాంతి, భాగ్యమ్మ, ధనమ్మ, రాధిక, నాగిరెడ్డి, కమలాకర్‌రెడ్డి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి : మండల పరిధిలోని యాదవ కులస్తులు ఆదివారం బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. మహిళలు అందంగా అలంకరించిన బోనాలను తలపై పెట్టుకుని గ్రామాల్లోని ప్రధాన వీధుల నుంచి ప్రదర్శనగా ఆలయం వద్దకు చేరుకున్నారు. భక్తులు అమ్మవారికి మూగజీవాలను బలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. వేడుకలల్లో కొండపాకగూడెం గ్రామ సర్పంచ్ కొమ్మనబోయిన మల్లేశం, తిరుగుడు మహలింగం, నగేష్, రవి, నర్సింహ, దాసరి శివరాజ్, కన్నెబోయిన శివ, మల్లేశం, సత్యనారయణ పాల్గొన్నారు.



కేతేపల్లి : ప్రదర్శనగా వెళ్తున్న మహిళలు


నకిరేకల్: ప్రదర్శనగా వస్తున్న మహిళలు

నకిరేకల్ : నకిరేకల్ పట్టణం ఆదివారం బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. అందంగా అలంకరించిన ఎడ్ల బండ్లను ఆలయం చుట్టూ తిప్పారు. భక్తులు భారీగా రావడంతో ముత్యాలమ్మ దేవాలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ముత్యాలమ్మ దేవాలయం వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సీఐ రాజశేఖర్, ఎస్ఐలు సుదీర్,గోపిక్రిష్ణలు సిబ్బందితో బందో బస్తు నిర్వహించారు. నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం, టీపీసీసీ నేత దైద రవీందర్‌లు వేర్వేరుగా హాజరై పూజలు నిర్వహించారు. వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, ఆలయ చైర్మన్ నడికుడి వెంకటేశ్వర్లు, ప్రతినిధులు జానయ్యగౌడ్, పెండెం సదానందం, చౌగోని సైదులు, సునీల్, విజయ్, సైదులు, కందాల భిక్షంరెడ్డి, వెంకన్నగౌడ్, గుండ్లపల్లినారయణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కేతేపల్లి: మండలంలోని ఇనుపాముల, కొత్తపేట తదితర గ్రామాల్లో ప్రజలు ఆదివారం ముత్యాలమ్మ (బోనాలు) పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి బోనం కుండలో వండిన నైవేద్యాన్ని, పట్టు వస్త్రాలను అమ్మవారికి సమర్పించారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి కోళ్లు, ఏటలను బలి ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. వేడుకలలో సర్పంచులు జాల వెంకట్‌రెడ్డి, బచ్చు జానకిరాములు, ఎంపీటీసీ బుర్రి యాదవరెడ్డి, ఉపసర్పంచులు గోపాల్, తండు రాములు, పాల్గొన్నారు.


కట్టంగూర్: మండలంలోని ముత్యాలమ్మగూడెంలో ఆదివారం ముత్యాలమ్మ పండగ వేడుకలను ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో ప్రదర్శనగా ఆలయం వద్దకు చేరుకున్నారు. అందంగా అలంకరించిన ప్రభలను ఎడ్లబండ్లు, ట్రాక్టర్లపై ఉంచి గ్రామంలో ఊరేగించారు. వేడుకలలో జెడ్పీటీసీ తరాల బలరాములు, సర్పంచి సుంకరబోయిన వెంకన్న, లింగస్వామి, శ్రీను పాల్గొన్నారు.


నకిరేకల్: బోనాల వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే


బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు


ట్రాక్టర్లపై ప్రభలను ఊరేగిస్తున్న గ్రామస్తులు

కిరణ్‌కు సర్వేపల్లి రాధాకృష్ణన్ పురస్కారం


అవార్డు అందుకుంటున్న కిరణ్

కనగల్: మండల కేంద్రానికి చెందిన తెలుగు అధ్యాపకుడు బచ్చగోని కిరణ్ కుమార్ యాదవ్‌కు పుడమి సాహితి సేవా వేదిక పురస్కారం లభించింది. విద్యా రంగంలో చేసిన కృషికి గాను డా. సర్వేపల్లి రాధాకృష్ణస్మారక 2023ను ఆదివారం నల్లగొండ పట్టణంలో ప్రముఖుల చేతుల మీదుగా అందుకున్నాడు.

ఆర్థికసాయం అందజేత

చిట్యాల: చిట్యాల పట్టణానికి చెందిన భవన నిర్మాణ కార్మిక సంఘం సభ్యుడు జిట్ట సంజీవ పదిరోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. ఆ కార్మిక సంఘానికి చెందిన సభ్యులు సేకరించిన పదిహేను వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని ఆదివారం మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పాల భిక్షం, పాల నర్సింహ, మంచాల గణేష్, కార్యదర్శి నాగిళ్ల రాజు పాల్గొన్నారు.

వర్షానికి తెగిన కుంట కట్టలు

మర్రిగూడ: మండల వ్యాప్తంగా శనివారం రాత్రి కురిసిన వర్షం కారణంగా లెంకలపల్లిలోని మేకాళికుంట కట్ట తెగిపోవడంతో నీరంతా రోడ్డుపైకి వచ్చి చెరువును తలపించింది. ఎస్సీ కాలనీ వద్ద ఉన్న కొత్తకుంట నిండడంతో సమీపాన పత్తిపంటలు నీటితో నిండిపోయాయి. జమ్మిచెట్టు దగ్గర వేసిన గూనలు కూడా దెబ్బతినడంతో రైతుల రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. దెబ్బతిన్న కుంట కట్టలకు తక్షణమే మరమ్మతులు చేపట్టి నీటిలో మునిగిన పత్తి పంటలకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నల్లగొండ టౌన్ : జిల్లా కేంద్రంలోని న్యూస్ స్కూల్‌లో 2013–14 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం సమ్మేళనమయ్యారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పాఠశాల చైర్మన్ గంట్ల అనంతరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు వివిధ రంగాల్లో ఉద్యోగాలు సాధించి స్థిరపడటం ఆనందంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గంట్ల పద్మ ప్రిన్సిపాల్ తిరుమల్‌రెడ్డి, స్పందన, వెంకట్‌రెడ్డి, భాస్కర్, లక్ష్మణ్, పర్వత్, అర్జున్ రెడ్డి, భరత్‌రెడ్డి, ఫాతిమా, విజయలక్ష్మి, నిరూప, పూర్వ విద్యార్థి కమిటీ సభ్యులు మణికుమార్‌రెడ్డి, మునింద్రనాయక్, మధుకుమార్, మన్మథరెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు